# గడ్డిపువ్వే గగన కుసుమం

వినత స్కూల్లో చదువుతుండగా ఒకనాడు సాయంత్రం ఏమి తోచక స్నేహితురాలింటికి పెళ్ళింది. వాకిట్లోకి తనపేరు వినబడగానే ఆశ్చర్యంగా నిలబడి పోయింది. "వినత మంచిదేగాని నాన్నా. గర్వం జాస్తి. ఎప్పుడూ వాళ్ళనాన్న గొప్పలే చెప్తుంటుంది. ఒక్కొకసారి విసుగు వస్తుంది" అంటోంది సరళ. వినత గుండె బిగపట్టుకుంది. సరళ తండ్రి "చెప్పుకోనీ, చెప్తే నీకు యీర్ష్య దేనికి? మీనాన్న బడిపంతులు అని నీకు చిన్నతనమా? నీ గురించి నువ్వు గర్వ పడగలిగేది! చెప్పుకో గలిగేది నువ్వే సంపాదించుకుంటే, నువ్వెవరి కూతురువని ప్రపంచం పట్టించుకోదు. స్వంతం అంటూ గర్వపడగలిగేది ఏమీ లేనప్పుడే మనుష్యులు తండ్రుల గురించి, తాతలగురించి మాట్లాడతారు" అన్నాడు. వినత లేత మనసు గాయపడింది యింట్లోకివెళ్ళి కాసేపు సరళతో గడిపి తిరిగి వెళ్ళిపోయింది. తనబాధ ఎవరితోటి పంచుకోలేక పోయింది. ఆ రాత్రి నిద్ర పట్టనేలేదు. "నేనేమి అబద్ధాలు చెప్పలేదే? మానాన్న జడ్జి కావడం అబద్దమా? మాకు కారుండటం అబద్దమా? కాలేజీల్లోనూ, క్లబ్బుల్లోమా ఉత్సవాల్లో మా అమ్మ వెళ్ళి బహుమతులు పంచడం అబద్ధమా? నిజంచెప్తే ఏందుకు సహించలేకపోయింది సరళ. నా క్లాసు మేట్సంతా చెప్తారు వాళ్ళిళ్ళల్లోని కబుర్లు అనసూయ. వాళ్ళక్క అత్తింట్లో పడే కష్టాల గురించి వర్ణించి వర్ణించి చెప్తుంది. దాంట్లో సగం నాకర్థమే కావు. అయినా సానుభూతితో వినడం లేదా అందరు? జానకి వాళ్ళింట్లో

వాళ్ళనాన్నకు కోపంవస్తే యింట్లో వాళ్ళందర్నీ ఎట్లా చావబాదుతాడో గంటలతరబడి చెప్తుంది. విమల వాళ్ళు డబ్బుచాలక ఎంత అవస్థపడేది, మధ్య మధ్య నగలు తాకట్టు పెట్టవలసి వచ్చినపుడల్లా వాళ్ళ అమ్మా, నాన్నా ఎట్లా పోట్లాడుకునేది కథలాగ చెప్తుంది. అందరి కబుర్లూ ఓపిగ్గా వినే సరికి సరళకు నా కబుర్లు ఎట్లా విసుగు వస్తాయి?" అనుకుంది వినత. వెంటనే ఒక విషయం స్ఫురించింది వినతకు. తను చెప్పే కబుర్లలో కష్టాలూ, బాధలూ లేవు! అందుకే అందరికి లభించిన సానుభూతి ఆమెకు దొరకలేదు. గర్విష్టి అన్న బిరుదు మాత్రం దక్కింది. "ఛీ మనిషికి కష్టాలు లేకపోవడంకన్నా కష్టం యింకోటి వుందా?" అనుకుంది తర్వాత వారంరోజుల వరకు సరళతండ్రి మాటలు వినత చెవుల్లో మ్రోగుతూనే వున్నాయి. "హుం. నా విలువేమిటో చూపిస్తాను వాళ్ళకు!" అనుకుంది. కూతురికి అకస్మాత్తుగా చదువుమీద అంత శ్రద్ధ కుదిరిందేమిటా" అని ఆశ్చర్యపోయారు వినత తల్లిదండ్రులు. ఏటేటా క్లాసంతటికి ఫస్టుగా రావడం, బహుమతులు పొందడం అలవాటయింది వినతకు. బహుమతి అందుకునే టప్పుడల్లా వినతకు సరళ తండ్రి గుర్తుకు వచ్చేవాడు. ఆ గుర్తుకు రావడంలో కృతజ్ఞతాభావం వుండేదికాదు. ఆయనపట్ల కక్షతీర్చుకున్నట్లుగా ఫీలయ్యేది. ఒక ఏడాది స్కూలు వార్షికోత్సవంలో బహుమతులు పంచింది. వూరికి క్రొత్తగా వచ్చిన గవర్నమెంటు హాస్పటల్లోని లేడీడాక్టరు. బహుమతి అందుకున్న వినత పొంగిపోయింది అంతకుముందు వినత కలెక్టర్లు, యితర గెజిటెడ్ ఆఫీసర్ల భార్యల నుంచి పుచ్చుకునేది బహుమతులు. వినత ఆ రాత్రి నేను తప్పక డాక్టరయి యీ వూరి హాస్పిటల్లోనే ఉద్యోగానికి వచ్చి, యీ స్కూలుకువచ్చి బహుమతులు పంచగలిగితే ఎంత గొప్ప" అనుకుంది. కలలకు కోరికలకు కళ్ళాలుండవు. వినత యింటరు పాసయ్యాక మెడిసిన్ చదువుతానంటే తల్లి, తండ్రి సమ్మతించలేదు వినత నిస్సహాయంగా ఏడ్చింది ఆమె తండ్రి కాస్త కరిగి "పోనీ పంపుదాం, దాని కంత కోరిగ్గాఉంటే కాదనడం దేనికి?" అన్నాడు భార్యతో. ఆమె మండిపడి "ఒక్కగానొక్క పిల్లకు ముచ్చటగా పెళ్ళి చేద్దామన్న

యోచనలేకుండా మెడిసిన్ ఏమిటండీ ఖర్మ. అడ్డమైన రోగాల........"
"సరే, సరే యిహ ఆపు" అన్నాడు జడ్జీగారు.

వినతకు ఫస్టుమార్కులు వచ్చినపుడుల్లా ఎవరో ఒక క్లాసుమేటు ఒక వంకరమాట విసిరేది. "నీకేమోయి, రాజకుమార్తెలాగ, యింట్లో పనా, ఏమన్నానా? ఎప్పుడూ చదివితే ఎందుకురావు ఫస్టుమార్కులు?" అంది జయలక్ష్మి. "నీకేమోయి, ఒక్కగానొక్క కూతురివి: నేను మా ముగ్గురి చెల్లెళ్ళకు జడలువేసి, ముగ్గురు తమ్ముళ్ళకు నీళ్ళపోసి, స్కూలుకు పంపి, వాళ్ళందరి బట్టలు వుతికి ఆరవేసి స్కూలుకువస్తాను. నాకు హోం వర్కు చెయ్యడానికూ్కడ పైముండదు" అంది శేషారత్నం. "ఇంట్లో పనిలేకపోవడం, తమ్ముళ్ళు, చెల్లెళ్ళు, లేకపోవడం. నా తప్పా?" పనిచేసి స్కూలుకు వచ్చినా నేను ఫస్టుమార్కులు తెచ్చుకోగలను" అని వినత మనసు అల్లాడిపోయింది దరిద్రం, రోగాలు లాంటి చీదరపట్టిన యిళ్ళల్లోని పిల్లలు ప్రేమకు కరువాసిపోయినట్లు, ఏ సమస్యలూ లేని వినత 'సానుభూతి' కోసం పరితపించిపోయేది. ఓ ఎండాకాలంలో వినతకు టైఫాయిడ్ వచ్చింది. చూడ్డానికివచ్చిన వాళ్ళంతా "అయ్యోపాపం!" అంటే వినతకు "యీ జబ్బు తగ్గకుండా వుంటే ఎంత బాగుండును:" అనిపించింది "వినతా, నీ జుట్టంతా వూడిపోయిందోయ్, ఎన్నాళ్ళకు వస్తుందోగాని, మాకే కష్టంగావుంది. నీకెట్లా వుందో!" అన్నారు స్నేహితురాళ్ళు. వినత మనసు ఆ చల్లని ఓదార్పుకు పొంగిపోయింది. ఆ సాయంత్రమే తల్లి స్నేహితురాలు వచ్చి "వినతా ఎంత అదరగొట్టావమ్మా మీ అమ్మగార్ని? నీళ్ళు, నిద్రా లేకుండా నీమంచంలో వుండిపోయారనుకో?" అంది వినత తల్లి కళ్ళు తుడుచుకుంది. వినత సంతోషమంతా హరించుకుపోయింది. "ఛీ! ఎందుకిట్లా జరిగింది? ఆ జ్వరం అమ్మకువచ్చి, నేను నీళ్ళు, నిద్రాలేకుండా అమ్మకు సపర్యలు చేసినట్లయితే ఎంత బాగుండేది? దేవుడు నన్నెపుడూ అన్యాయమే చేస్తున్నాడు" అనుకుంది.

తల్లి బలవంతాన వినత బి.యస్.సితో చదువు మానేసింది. కాల క్షేపానికి పుస్తకాలు చదువుతుండేది. ఏ కథలోనూ, ఏ కావ్యంలోనూ, కష్టాలనుభవించిన కథానాయిక కనపడలేదు వినతకు. ఎంత ఎక్కువగా కష్టాలు అనుభవించాల్సివస్తే అంత గొప్పదైపోతుంది కథానాయిక. ఆకలి సమస్యలు లేనివాళ్ళకి మానసిక సమస్యలుండేవి. సంఘర్షణలేని బ్రతుకు ఏమి బ్రతుకు? జీవితం వడ్డించిన విస్తరైతే, మనిషికి ఆకలి వుండదా. "నా బ్రతుకు ఎంత చప్పగా తయారైంది" అని వాపోయేది వినత. ఆమెకు పెళ్ళిప్రయత్నాలు జరుగుతుండగా, వినత బీదవాడైన భర్తను, రాక్షసిలాంటి అత్తను కోరుకునేది. "నాకూ కష్టాలనుభవించడం చేతనవునని" లోకానికి తెలియచెప్పాలనుకునేది వినత. బియ్యం అన్నం గావడానికి ప్రత్యేక శిక్షణ పొందనక్కరలేదు. ఎసట్లో పోసిన బియ్యం ఉడికినట్లే, వరదల్లాగా కష్టాలువస్తే మనుష్యులు మునిగితేలుతారు. యీ సత్యం తెలియలేదు వినతకు.

వినతకు పెళ్ళయింది. ఆమె కోరుకున్నట్లు భర్తకు ఆస్థిలేదుగాని ఆ అబ్బాయి సి.పి.డబ్ల్యు డి.లో అసిస్టెంటు ఇంజనీరు. భర్తతో ఒంటరి కాపురంలో వినతకు అత్తపోరు లభించలేదు. నెల తప్పిన దగ్గర్నుంచి వినతకు కూతురు పుట్టాలని, కోరుకునేది. కూతుర్ని బాగా చదివించి పెద్ద ఉద్యోగస్థురాలిగా చెయ్యాలని కలలు కనేది. కాని కొడుకే పుట్టాడు. మళ్ళీ పిల్లలు కలుగలేదు. తాను డాక్టరు కావాలనుకుంది, కాలేదు. కనీసం డాక్టర్ని పెళ్ళాడలేదు. కనుక తప్పకుండా కొడుకుని డాక్టర్ని చేద్దామను కుంది. అంతలో భర్తకు వరసగా ప్రమోషన్లు రావడం, ట్రాన్స్ఫర్ల కారణంగా దేశంలోని పెద్ద పెద్ద పట్టణాలన్నీ చూసింది వినత. వెళ్ళిన చోటల్లా భర్త హోదా కారణంగా అనేక గౌరవమర్యాదలు జరిగేవి వినతకు. బహుమతులు పంచడానిక్కూడ అప్పుడప్పుడు వినతను పిలిచే వారు. మొదటిసారి అటువంటి సందర్భంలో ఆమె మనసు మూలిగింది. "నేను అనుకున్నదేమిటి? జరిగిందేమిటి?" అనుకుంది.

కొడుకుని మెడిషన్ చదవమని బ్రతిమిలాడింది వినత. ఆ అబ్బాయి వినలేదు. "వాడికిష్టం లేదంటే నీ బలవంత మేమిటి?" అని విసుక్కున్నాడు భర్త. వినత మళ్ళీ పెదవి విప్పలేదు. వినత కొడుకు ఐ. ఎ. యస్. పాసయ్యాడు ప్లానింగ్ శాఖలో డిప్యూటి సెక్రటరీగా నియమితుడయ్యాడు. ఆర్డరు కాయితం చేతపుచ్చుకుని "అమ్మా, తాతగారి వూళ్ళోనే అయింది నాకు ఉద్యోగం! నువ్వు నా గురించి బెంగపడకు. నేను అమ్మమ్మ దగ్గర వుంటాలే" అన్నాడు వినత భర్త భార్యనుచూసి నవ్వుతూ "వాడి పెళ్ళి భారం మీ అమ్మగారికి వదిలెయ్యి, నీకు చేత కాలేదు" అన్నాడు. కొడుకుతోపాటు వినతకూడ బయలుదేరింది పుట్టింటికి. జడ్జీగారి సంతోషానికి మేరలేదు. మనమడిగురించి తప్ప మాట్లాడ్డానికి యింకో విషయం తోచడంలేదు ఆయనకిప్పుడు. ఆయన స్నేహితుడొకాయన వినత కొడుకును పలకరించి "మీ అమ్మ మావూరి ఆడపడుచు బాబూ! నిన్ను మావూరి సేవకు పంపి మా ఋణం తీర్చుకున్నాదామె" అన్నాడు. వినత కొడుకు తల్లివంక గర్వంగా చూచాడు. వినతకు ఆ చూపు పరిచితమైనదే. పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళేటప్పుడు ఆమె తండ్రి అట్లాగే గర్వంగా చూచాడు. "మంచి కూతురివి" అన్నాయతని కళ్ళు! కొడుకు I. A. S. పాసయ్యాడని తెలిసినరోజున వినత భర్త. ఆమెవంక గర్వంగా చూచాడు. "మంచి యిల్లాలివి" అన్నాయతని కళ్ళు. యివాళ కొడుకు కళ్ళు "మంచి అమ్మవు" అంటున్నాయి. వినతకూ్కడ గర్వంగానే వుంది. జీవితంలో ఆమెకు సుఖం, సంతోషం, పుష్కలంగానే లభించాయి. కాని ఆమె మనసు మాత్రం ఎప్పుడూ గ్రహణం పట్టిన చంద్రుడిలాగే వుంది.

—o—